క్లుప్తంగా

గరుడవాహన పూజ



దేవతామూర్తులకు పూజలు చేస్తున్న పూజారులు

మునిపల్లి (అందోల్): జీవన్ముక్త సంస్థానం ఉత్సవాల్లో భాగంగా గరుడ వాహనపూజను పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహరాజ్ నిర్వహించారు. మంగళవారం రెండవ రోజూ గరుడవాహన పూజ వేద పండితులు మంత్రోచ్ఛరణ మధ్య చేశారు. అంతకుముందు పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులతో పాటు జీవన్ముక్త మహరాజ్‌కు సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహరాజ్ పూజలు చేశారు. గరుడ వాహనంతో సంస్థాన దేవాలయం చుట్టూ భక్తులు భజన పాటలు పాడారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దళారులపై చర్యలు తీసుకోండి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): పత్తి కొనుగోలు దళారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో రైతుల నుంచి దళారులు పత్తిని కొనుగోలు చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల వద్ద దళారులు పత్తిని కొనుగోలు చేస్తూ తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు క్వింటాల్‌కు రూ.10వేలు మద్దతు ధరను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ ఏరియా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ భూషణం, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ



వంట గదిని పరిశీలిస్తున్న భిక్షపతి

జహీరాబాద్ టౌన్: మండలంలోని బూచినెల్లి వద్ద ఉన్న ఆల్గోల్ బాలికల మైనార్టీ గురుకుల పాఠశాలను మంగళవారం స్పెషల్ ఆఫీసర్ భిక్షపతి ఆకస్మికంగా సందర్శించారు. గురుకులంలోని వంట గది, పరిసరాలను తనిఖీ చేశారు. నిత్యావసర సరుకుల నాణ్యత, వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్, ప్రిన్సిపాల్ ఉన్నారు.

స్థానిక ఓటర్లను తొలగించొద్దు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులోని పోలింగ్ బూత్ 188, 189, 190, 191ల్లో ఉన్న 228 ఓటర్లు స్థానికులేనని వాటిని తొలగించొద్దని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్‌రావు కోరారు. 11వ వార్డులోని ఓటర్లను తొలగించాలని కొందరు ఫిర్యాదు చేశారని సమగ్ర విచారణ చేసి స్థానిక ఓటు హక్కు కలిగిన వారిని తొలగించవద్దని మంగళవారం నాయబ్ తహసీల్దార్ వీరేశంకు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



నిర్మాణాన్ని కూల్చుతున్న సిబ్బంది

పటాన్‌చెరుటౌన్: మండలంలోని ఇంద్రేశంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు మంగళవారం కొనసాగాయి. ఆర్కే–2 నవ్య సెంటర్‌లో రెండు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి సుభాష్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఇచ్చిన అనుమతులకు మించి నిర్మించిన భవనాలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నోటీసులిచ్చినా వినకుండా నిర్మాణాలు చేస్తుండటంతో కూల్చివేస్తున్నట్లు చెప్పారు. తిరిగి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పంచాయతీ నుంచి తీసుకున్న అనుమతుల మేరకు నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

యువకుడి అదృశ్యం



జగదీశ్

పటాన్‌చెరు టౌన్: డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కుర్షిత్ అలీ కథనం ప్రకారం.. పట్టణంలోని జేపీకాలనీకి చెందిన జగదీశ్(24), సోమవారం డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మంగళవారం జిల్లా వ్యాప్తంగా రాజకీయ పార్టీల నేతలు, అధికారులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రజలందరూ అనుభవిస్తున్నారని అన్నారు. భారతదేశంలో కుల,మత ,వర్గ విభేదాలు లేకుండా అన్ని రంగాల్లో అందరికీ సమాన అవకాశాలు మన రాజ్యాంగం కల్పించిందన్నారు. రాజ్యాంగానికి లోబడి దేశ అభివృద్ధికి సహకరించాలని తెలిపారు.



జహీరాబాద్ టౌన్: గురుకులంలో విద్యార్థుల ప్రదర్శన



జహీరాబాద్ టౌన్: మాట్లాడుతున్న ప్యానెల్ అడ్వకేట్ సోమశేఖర్



రామచంద్రాపురం(పటాన్‌చెరు): అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కౌన్సిలర్ భరత్



పటాన్‌చెరు టౌన్: డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



జిన్నారం (పటాన్‌చెరు): ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులు



సంగారెడ్డి రూరల్: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సదాశివపేట పట్టణంలో ..

నల్లవాగు నింపేందుకు చర్యలు

రూ. 90 కోట్లతో పనులకు ప్రతిపాదనలు: ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): సింగూరు ప్రాజెక్టు నుంచి జిల్లాలోని మధ్యతరహ ప్రాజెక్టు నల్లవాగు నింపేందుకు రూ. 90 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ.. నల్లవాగు ప్రాజెక్టు ఆధునీకరణ, కాల్వల సీసీలైనింగ్, మిగిలిన పనులు పూర్తి చేసేందుకు మరో రూ.50 కోట్లతో ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. ఏదీ చేసినా తమ ప్రభుత్వం ముందుచూపుతో ఆలోచించి పనిచేస్తుందని స్పష్టం చేశారు. నల్లవాగు కింద యాసంగి పంటల సాగుకు త్వరలో నీటిని విడుదల చేస్తామని చెప్పారు. పంటల సాగు కోసం ప్రాజెక్టులో ఉన్నా నీటిని వృథా చేయకుండా వినియోగిస్తామని వివరించారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టు గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆధునీకరణ పనులు పూర్తి చేశామని గుర్తు చేశారు. నీటి విడుదల విషయంలో మాజీ ఎమ్మెల్యే భూపల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రైతులను తప్పువదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రాకేష్ షెట్కార్, నాయకులు పోచయ్య, దేవదాస్, తాహెర్‌అలీ, రమేష్‌చౌహన్, వినోద్‌పాటిల్, సాయిలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తడ్కల్, ఘన్‌పూర్, కంగ్టిలో మంగళవారం పనుల జాతరలో భాగంగా రూ. 4.74 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కంగ్టి క్రాంతి చౌక్ నుంచి ఎస్సీ కాలనీ గుండా చౌకన్‌పల్లి క్రాస్‌రోడ్డు వరకు రూ. 2.5 కోట్ల నిధులతో డబుల్‌రోడ్డు, తడ్కల్‌లో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో రూ. 10 లక్షలతో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులు, ఘన్‌పూర్‌లోరూ. 2.14 కోట్ల నిధులతో ఘన్‌పూర్ నుంచి కామారెడ్డి జిల్లా సరిహద్దు వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, డీఈ మధుసూదన్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ శాదుల్, రాకేష్ షెట్కార్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

కల్హేర్(నారాయణఖేడ్): ప్రతి గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి వెల్లడించారు. మంగళవారం సిర్గాపూర్, కల్హేర్, గోసాయిపల్లి, పోడ్చెట్‌పల్లిలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రాకేష్‌షెట్కార్, పీఆర్ డీఈఈ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ శివశ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వీర్‌షెట్టి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

న్యాల్‌కల్‌లో ముమ్మరంగా పనులు



పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రత్యేకాధికారి వీరేందర్‌రెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ మండలం బసంత్‌పూర్‌లో ప్రభుత్వం చేపట్టిన పనుల పండుగ జాతర విజయోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ప్రత్యేక అధికారి వీరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ అబ్బాస్ అలీ, జగన్నాథ్ స్వామి, డీలర్, వీఓ లీడర్స్, ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు, నాయకులు తదితరులు సంబరాల్లో పాల్గొన్నారు.

స్థానిక అంశాలపై అధ్యయనం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలో ట్రైనీ ఐఏఎస్ అధికారుల పర్యటన కొనసాగుతోంది. మంగళవారం వారు అన్నారం గ్రామపంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రంతో పాటు ఐకేపీ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ప్రక్రియలపై సమగ్రంగా తెలుసుకున్నారు. పరిపాలన సౌలభ్యం, స్థానిక అంశాలపై లోతైన అవగాహన ఎంతో ముఖ్యమని ట్రైనీ అధికారుల బృందం అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐకేపీ అధికారులు సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, మండల పరిషత్తు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో ట్రైనీ అధికారులు



అందోల్‌లో పూజలు చేస్తున్న మంత్రి దమోదర రాజనర్సింహ తదితరులు

రంగనాథ ఆలయంలో దీపోత్సవం

జోగిపేట(అందోల్): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని అందోల్‌లోని భూనీల సమేత రంగనాథ స్వామి దేవాలయంలో మంగళవారం ద్విసహస్ర దీపోత్సవం, డోలోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ప్రత్యేకంగా అలకరించిన డోలారోహణంలో స్వామివారి ప్రతిమలను ఉంచి డోలోత్సవం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్తీక మాస దిపోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్ మోహన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సునీతారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, ఆర్డీఓ పాండు, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్ పాల్గొన్నారు.

పశువుల సంత ఏర్పాటుకు వినతి

జోగిపేట(అందోల్): జోగిపేట మున్సిపల్ పరిధిలో గత కొన్ని నెలలుగా పశువుల సంత లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం జోగిపేటకు వచ్చిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు రైతులు వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ పరిధిలో పశువుల సంత లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి పశువులను అమ్ముకోవాల్సి వస్తుందని వారు మంత్రి దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన మంత్రి దామోదర జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డిని పిలిచి వెంటనే మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి మార్కెట్ యార్డులో ప్రారంభించాలని ఆదేశించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు రాములు, పోచయ్య, జోగయ్య, సుధాకర్, మల్లేశం, శివయ్య మంత్రికి ఉన్నారు.



మంత్రి దమోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఉత్తమ కూలీలకు సన్మానం

మునిపల్లి(అందోల్): పనుల పండుగ జాతర సందర్భంగా ఉత్తమ కూలీలను ఎంపీడీఓ హరిందన్‌రావు శాలువా కప్పి సన్మానించారు. మంగళవారం మండలంలోని బుదేరా, కంకోల్ గ్రామ శివారులో ఉత్తమ కూలీలను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హరినందన్‌రావు మాట్లాడుతూ.. వర్షం నీటిని భూమిలోకి ఇంకించడం అత్యంత అవశ్యకం అన్నారు. ప్రతి రైతు వారి వారి వ్యవసాయ భూమిలో పరం పనులను నిర్వహించుకోవాలని సూచించారు. భూగర్భ జలాలు పెంపొందించడానికి పరం పనులు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఏపీడీ పూజా, ఎంపీఓ అండాలమ్మ, ఏపీఓ యాదగిరి, పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, సంతోష, ఫిల్డ్ అసిస్టెంట్ అర్చన, టెక్నికల్ అసిస్టెంట్ మైబూబ్, సంతోష్, ఫిల్డ్ అసిస్టెంట్ ఉల్లాస్ మల్టిపర్పస్ వర్కర్లు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.



ఉత్తమ కూలీలను సన్మానించిన ఎంపీడీఓ

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

ట్రాఫిక్ ఎస్ఐ రాములు

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పటాన్‌చెరు ట్రాఫిక్ ఎస్ఐ రాములు అన్నారు. మంగళవారం మండలంలోని ముత్తంగి సమీపంలో ఆటోడ్రైవర్లకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి రోజు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. రాంగ్ రూట్‌లో ఆటోలను నడపొద్దని చెప్పారు. అలాగే ఆటోలను ఎక్కడపడితే అక్కడ అడ్డదిడ్డంగా నిలపొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న రాములు

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని పెద్దాపూర్‌లో మంగళవారం అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. సాయిగణేష్ కన్నె స్వామిప్రకాష్ గురుస్వామి, శ్యామ్ పంతులు, మోహన్ రావు, రవి గౌడ్, ఈశ్వర్ గౌడ్,కుమార్ గౌడ్,రమేష్ గౌడ్,హరీష్ గురుస్వాముల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా పడిపూజను నిర్వహించారు. ప్రత్యేక వేదికపై అయ్యప్ప, గణపతి, సుబ్రమణ్య ఉత్తవ మూర్తులకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. పంచామృత అభిషేకం నిర్వహించి అర్చన, అష్టోత్తర శతనావలి జరిపారు. ప్రత్యేక పూజలను నిర్వహించిన గురుస్వామి స్వాములచే కర్పూర హారతులను అందించారు. ఈ సందర్భంగా పుష్పాభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో గురు స్వాములు రవీందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి,అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.



పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వాములు

సంక్షిప్త వార్తలు

◆ ఉచిత వైద్య శిబిరంతో లబ్ధి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో పీబీఆర్ ఆస్పత్రి యజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పారిశ్రామికవాడలోని గర్భిణీలకు డాక్టర్లు కృష్ణకాంత్ రెడ్డి, శ్రీ వీణ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం రోజా మాట్లాడుతూ... పారిశ్రామికవాడలో నివసించే ఇతర రాష్ట్రాల పేద మహిళలకు ఉచితంగా శిబిరాలు నిర్వహించి కార్పొరేట్ వైద్య సేవలను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి యజమాన్యం శ్రీకాంత్‌రెడ్డి, విద్యాకాంత్ రెడ్డి, వైద్య సిబ్బంది, గర్భిణిలు, స్థానికులు పాల్గొన్నారు.

◆ ఎస్సీల భూములు తీసుకోవద్దు

సంగారెడ్డి టౌన్: గ్రామాల్లోని ఎస్సీల భూములు అభివృద్ధి పేరిట తీసుకోవడం సరికాదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సాయిలు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పసల్వాది గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభలకు ఇంటింటి విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీల భూముల జోలికి వస్తే ప్రభుత్వం పతనం అవుతుందన్నారు. వెంటనే వారి భూములను తిరిగి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ సంగారెడ్డి కార్యదర్శి యాదగిరి, కమిటీ సభ్యులు శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

◆ వాటర్ ఫిల్టర్ అందజేత

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని ఇప్పెపల్లి ప్రభుత్వ పాఠశాలకు హైదరాబాద్ రోటరీ క్లబ్ వారు మంగళవారం ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు ఇతర సామగ్రిని కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు కన్నన్, కార్యదర్శి సీవీరెడ్డి, డైరెక్టర్ జగదీష్, సూర్య, మానిక్యం, పాఠశాల కమిటీ మాజీ చైర్మన్ చంద్రకాంత్, ఎస్‌జీటీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల కిష్టయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తడ్కల్ గ్రామంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా వాహనదారులకు పరీక్షలు నిర్వహించి, జరిమానాలు విధించారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాల బారిన పడి జీవితాలే కోల్పోయే ప్రమాదం ఉందని ఎస్ఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పండరి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

◆ వాహనదారులకు జైలుశిక్ష

సంగారెడ్డి క్రైమ్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించిన ఘటన సంగారెడ్డి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. సోమవారం రాత్రి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా, ఐదుమంది వాహనదారులు మద్యం సేవించి పట్టుపడ్డారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా జడ్జి ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష, మిగతా ఇద్దరికి రూ. 2000, మిగతా ఇద్దరికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ శబరిమలకు అయ్యప్పస్వాములు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం నస్తీపూర్ రామాలయం సన్నిధానం అయ్యప్ప స్వాములు ఇరుముడితో మంగళవారం శబరిమలకు బయలుదేరారు. 41 రోజుల పాటు అయ్యప్పమాల వేసుకుని నియమనిష్టాలతో పూజలు చేసి, అయ్యప్ప స్వాములు స్వామివారిని దర్శించుకునేందుకు అంజనేయులు గురుస్వామి ఆధ్వర్యంలో బయలుదేరారు. దౌల్తాబాద్ శివాలయం నుంచి కన్నయ్య గురుస్వామి ఆధ్వర్యంలో స్వాములు శబరిమల దర్శనానికి తరలి వెళ్లారు. ఈ ఇరుముడి పూజా కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల అయ్యప్పస్వాములు పాల్గొ న్నారు.

◆ బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల కేంద్రానికి చెందిన కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘ సభ్యుడు సాయాగౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ కోరారు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్లుగీత వృత్తితో కుటుంబాన్ని పోషించుకునే సాయాగౌడ్ మృతితో కుటుంబం జీవనాధారం కోల్పోయిందన్నారు. కల్లుగీత కార్మికులకు ఇవ్వాల్సిన పరిహారాన్ని ఎలాంటి షరతులు లేకుండా అందించాలని కోరారు. బీసీ కార్పొరేషన్ ద్వారా తక్షణ సహాయం కింద రూ.25 వేలు అందించాలన్నారు. ఆయన వెంట సంఘ జిల్లా ఉపాధ్యక్షులు అంజాగౌడ్, డివిజన్ బాధ్యులు నర్సింహాగౌడ్, భూమాగౌడ్, భాస్కర్ గౌడ్, దుర్గాగౌడ్, శివాగౌడ్, సాయిబాబాగౌడ్, శ్రీకాంత్ కృష్ణాగౌడ్ ఉన్నారు.

◆ గురుకులాల్లో ఆకస్మిక తనిఖీలు



నారాయణఖేడ్/కొండాపూర్(సంగారెడ్డి)/హత్నూర(సంగారెడ్డి): జిల్లాలో పలు గురుకుల పాఠశాలలు, కళాశాలలను అధికారులు, వివిధ సంఘాల నాయకులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఖేడ్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను ఖేడ్ ఆర్డీఓ స్థానిక తహసీల్దార్ భాస్కర్‌తో కలసి సందర్శించారు. బియ్యంతో పాటు వంట సరుకుల నిల్వలు, తరగతి గదులు, వంటగది, పరిసరాల్లో శుభ్రత పరిశీలించారు. జూకల్ శివారులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను తహశీల్దార్ భాస్కర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తనిఖీ చేసి విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. కొండాపూర్ మండలం గిర్మాపూర్ గురుకుల పాఠశాలను ప్రజా సంఘాల నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి అశోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. పురుగుల అన్నం, ఉడికి ఉడకని కూరగాయలతో భోజనం పెడుతున్నారని దీంతో విద్యార్థులు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. నాణ్యమైన భోజనం అందించాలని, నాసిరకం కూరగాయలు తె స్తున్న కాంట్రాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

హత్నూరలో..

హత్నూరలోని డా.బీ.ఆర్.అంబేడ్కర్ జూనియర్ కళాశాలను జెడ్పీడిప్యూటీ సీఈవో స్వప్న ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిపెట్టిన అన్నం కూరగాయలను పరిశీలించారు. మెనూ ప్రకారం ప్రతిరోజు ఆహారాన్ని అందించాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో శంకర్ ఎంపీవో యూసుఫ్ తదితరులున్నారు.